సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

మంగళవారం : 21 : మే : 2024



టన్ను చీనీ రూ.37 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.37 వేలు పలికాయి.



బొప్పాయి సాగు.. భలే బాగు

ఏడాదికేడాదికీ బొప్పాయి సాగు పెరుగుతోంది. లాభాలు వస్తుండటంతో రైతులు ఆసక్తి చూపుతున్నారు. 8లో

గరిష్టం/కనిష్టం

37.7°/22.3°

జిల్లా అంతటా సోమవారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై కొన్ని మండలాల్లో మోస్తరు నుంచి తేలిక పాటి వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 10 కి.మీ. వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

23న ఉద్యోగమేళా



అనంతపురం: అనంతపురం ఉప్పరపల్లి రోడ్డులో ఆర్డీటీ స్టేడియం ఎదురుగా ఉన్న ఏఎఫ్ ఎకాలజీ సెంటర్‌లో ఈ నెల 23న ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ డాక్టర్ వై.వీ.మల్లా రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన మేరకు.. అమరరాజా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో రెండు సంవత్సరాల ఉచిత టెక్నికల్ శిక్షణ అనంతరం ఉద్యోగావకాశాలు కల్పిస్తారు. పదో తరగతి పాస్, ఫెయిల్, ఇంటర్ పాస్/ఫెయిల్, ఐటీఐ పాస్/ ఫెయిల్ (ఏ ట్రేడ్ అయినా) ఉద్యోగ మేళాకు అర్హులు. 16 నుంచి 25 సంవత్సరాల మధ్య వయసున్న యువత మేళాలో పాల్గొనవచ్చు. శిక్షణ సమయంలో స్టైఫండ్ ఉంటుంది. మొదటి మూడు నెలలు రూ.7,500, తరువాత 9 నెలలు రూ.11,453, చివరి 12 నెలలు రూ.11,653 చెల్లిస్తారు. యువతీ,యువకులకు వేర్వేరు హాస్టల్ వసతి కల్పిస్తారు. శిక్షణానంతరం సర్టిఫికెట్ అందజేస్తారు. ఆసక్తి గల వారు తమ రెజ్యూమ్ లేదా బయోడేటాతో ఈ నెల 23న జాబ్‌మేళాకు హాజరుకావచ్చు. పూర్తి వివరాలకు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు : 90000 24919, 91004 77371, 77807 52418.

శేషవాహనంపై సంగమేశ్వరుడు



శేషవాహనంపై ఊరేగుతున్న సంగమేశ్వరుడు

కొత్తచెరువు: మండల కేంద్రం కొత్తచెరువులోని సంగమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో సోమవారం పార్వతీసమేత సంగమేశ్వర స్వామి శేషవాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను శేషవాహనంపై కొలువు దీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. మంగళ వారం సంగమేశ్వరస్వామి నంది వాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

పిడుగుపాటుకు కూలీ మృతి



మృతి చెందిన చంద్రశేఖర్

బత్తలపల్లి: ఉప్పర్లపల్లి సమీపాన పిడుగుపాటుకు కూలీ ఒకరు మృత్యువాత పడ్డారు. గ్రామస్తులు తెలిపిన సమాచారం మేరకు... మండలంలోని దంపెట్ల గ్రామానికి చెందిన జింకా చంద్రశేఖర్ (55) ఉప్పర్లపల్లి–గరిశలపల్లి గ్రామాల సమీపాన గల సుధీర్ అనే రైతు పొలంలో కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సోమవారం రాత్రి పొలం వద్ద ఉండగా వర్షం ప్రారంభం కావడంతో ఇంటికి బయల్దేరాడు. ఇంతలో ఉరుములు, మెరుపులుతో కూడిన వర్షం అధికం కావడంతో సమీపాన కోళ్లఫాం వద్ద ఉన్న రైతుల వద్దకు వెళుతుండగా పిడుగుపడింది. ఆ పిడుగుపాటు ప్రభావంతో ఆందోళనకు గురైన చంద్రశేఖర్ రైతుల వద్దకు చేరుకుని దాహంగా ఉందని నీళ్లు తాగాడు. అంతే ఉన్న పళంగా చంద్రశేఖర్ కుప్పకూలి ప్రాణం విడిచాడు. ఇతనికి భార్య ప్రమీలమ్మ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. నిరుపేద కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

లేపాక్షి ఐటీఐలో అడ్మిషన్లు



హిందూపురం: జిల్లాలో పదో తరగతి పాసైన విద్యార్థులకు లేపాక్షిలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)లో మొదటి విడత అడ్మిషన్లు ప్రారంభమైనట్లు కన్వీనర్ రాయప్ప రెడ్డి తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు జూలై పదో తేదీ సాయంత్రం 5గంటలలోపు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. దరఖాస్తులను లేపాక్షి ప్రభుత్వ ఐటీఐలో తప్పనిసరిగా వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు. వెరిఫికేషన్ చేసుకున్న అభ్యర్థులు మాత్రమే కౌన్సెలింగ్‌కు అర్హులవుతారని చెప్పారు. ఐటీఐలో శిక్షణ పొంది సర్టిఫికెట్ పొందిన వారికి పారిశ్రామిక ప్రైవేట్, ప్రభుత్వ అనుబంధ సంస్థలలో ఉద్యోగ అవకాశాలు ఉంటాయని తెలియజేశారు.



పుట్టపర్తిలో వర్షానికి జలమయమైన రహదారులు

మెరుపు మెరిసెన్.. వాన కురిసెన్..

మే నెల.. ఇంకా వేసవి ముగియనేలేదు. భారీ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇంట్లో ఉంటే ఉక్కపోత, బయటకెళ్తే మండే ఎండ.. జనం ఉక్కిరిబిక్కిర వుతున్నారు. ఇటీవల నాలుగైదు రోజులుగా సాయంత్రమయ్యే సరికే వాతావరణం చల్లబడుతోంది. ఆదివారం సాయంత్రం నుంచి జిల్లా వ్యాప్తంగా 18 మండలాల్లో వర్షం పడింది. సోమవారం మేఘాలు దట్టంగా ఆవరించి, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉక్కపోత, ఎండ వేడిమి నుంచి ప్రజలు ఉపశమనం పొందారు. మరోవైపు పదునైన వర్షాలు కురవడంతో ఖరీఫ్ సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు.

– పుట్టపర్తి రూరల్/ పుట్టపర్తి అర్బన్:



అగళి మండలం గౌడనకుంటలో వర్షానికి పొంగి పొర్లుతున్న చెక్‌డ్యాం



సోమందేపల్లిలో సోమవారం రాత్రి కురుస్తున్న వర్షం

కొత్తకొత్తగా సెంట్రల్ వర్సిటీ

ఇన్నాళ్లూ శాశ్వత భవనం లేక, తగిన వసతులు లేక కునారిల్లిన సెంట్రల్ యూనివర్సిటీ ఇక వెలిగిపోనుంది. జాతీయ స్థాయి నాణ్యత ప్రమాణాలకనుగుణంగా సకల హంగులతో కూడిన శాశ్వత భవనంలో ఈ విద్యా సంవత్సరం నుంచి కార్యకలాపాలు సాగించనుంది. వివిధ రాష్ట్రాల నుంచి వర్సిటీలో చేరే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా క్యాంపస్‌లో అన్ని వసతులు సమకూర్చారు.

నూతన సొబగులు.. కోర్సులు

- జంతలూరు శాశ్వత క్యాంపస్ నిర్మాణం పూర్తి
- ఈ విద్యా సంవత్సరం నుంచి కార్యకలాపాలు ప్రారంభం
- అందుబాటులోకి నూతన కోర్సులు
- యూజీ స్థాయిలో నాలుగు, పీజీ స్థాయిలో 10 కొత్త ప్రోగ్రామ్‌లు



ఇటీవల జంతలూరు వద్ద సెంట్రల్ వర్సిటీ శాశ్వత క్యాంపస్‌ను సందర్శించిన భారత ప్రభుత్వ ఉన్నత విద్యా కార్యదర్శి కె. సంజయ్‌మూర్తి

అనంతపురం: యూజీ స్థాయిలోనే అధునాతన కోర్సులు.. హ్యూమానిటీస్, ఆర్ట్స్, సైన్స్ సమ్మిళిత కోర్సులతో పాటు వివిధ రాష్ట్రాల సంస్కృతి, సంప్రదాయాల మేళవింపుతో విద్యావిధానం.. నిష్ణాతులైన ప్రొఫెసర్లతో బోధన వెరసి అనంతపురం సెంట్రల్ యూనివర్సిటీలో చేరేందుకు దేశంలోని వివిధ ప్రాంతాల్లోని విద్యార్థులు పోటీ పడుతుంటారు. నాణ్యమైన పరిశోధనలు చేయడానికి వీలుండడంతో చాలా మంది ఇక్కడ చదవడానికి ఆసక్తి చూపిస్తుంటారు. నిధులకు లోటు లేకపోవడం, ఎప్పటికప్పుడు బోధనా సిబ్బంది భర్తీ చేస్తుండడం సెంట్రల్ యూనివర్సిటీ ప్రత్యేకతలుగా చెప్పుకోవచ్చు. ప్రస్తుతం వర్సిటీలో 21 రాష్ట్రాలకు చెందిన 600 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. గత ఏడాది యూజీ, పీజీ కోర్సుల్లోని 358 సీట్లకు గాను ఏకంగా 2.20 లక్షల దరఖాస్తులు అందాయంటే సెంట్రల్ వర్సిటీలో ప్రవేశం కోసం విద్యార్థులు ఎంతగా ఆసక్తి చూపుతున్నారో అర్థం చేసుకోవచ్చు.

అందుబాటులోకి కొత్త కోర్సులు..

మారిన సాంకేతికత, పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా ఈ విద్యా సంవత్సరం (2024–25) నుంచి యూజీ స్థాయిలో నాలుగు అధునాతన కోర్సులు సెంట్రల్ వర్సిటీలో ప్రవేశ పెట్టారు. బీకాం (ఆనర్స్), బీఏ (ఆనర్స్- ఇంగ్లిష్), బీఎస్సీ (ఆనర్స్- కంప్యూటర్ సైన్సెస్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్), బీఎస్సీ (ఆనర్స్- సైకాలజీ) కోర్సులు తీసుకొచ్చారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే ఆలిండియా స్థాయి ఎంట్రెన్స్ టెస్ట్ నిర్వహించారు. ఇందులో ప్రతిభ చాటిన వారికి అడ్మిషన్లు కల్పిస్తారు.

- అలాగే, పీజీ స్థాయిలో ఎమ్మెస్సీ (మేథమేటిక్స్ అండ్ కంప్యూటింగ్), ఎంబీఏ, ఎంకాం, ఏంఏ (గవర్నెన్స్ అండ్ పబ్లిక్ పాలసీ), ఎమ్మెస్సీ (క్లినికల్ సైకాలజీ), ఎమ్మెస్సీ (కంప్యూటేషనల్ సోషల్ సైన్సెస్), ఎమ్మెస్సీ (ఎకనామిక్స్ అండ్ డేటా అనాలిసిస్), ఎమ్మెస్సీ (జియాగ్రఫీ అండ్ జియో ఇన్ఫర్మేషన్), ఎమ్మెస్సీ (స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ) కోర్సులు అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటికే దేశస్థాయిలో ప్రవేశ పరీక్ష కూడా నిర్వహించారు.

నూతన జాతీయ విద్యా విధానం అమలు..

నూతన జాతీయ విద్యా విధానం–2020 ప్రకారం సెంట్రల్ వర్సిటీలో వివిధ కోర్సులకు సంబంధించి మల్టీ ఎంట్రీ, మల్టీ ఎగ్జిట్ విధానం ప్రవేశపెట్టారు. మేజర్, మైనర్ రెండు డిగ్రీలను ఏకకాలంలో తీసుకునే అవకాశం కల్పించారు. మారుతున్న పరిస్థితులు, పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా ఈ ప్రణాళిక అమలు చేస్తున్నారు. విద్యార్థులకు ఉద్యోగావకాశాలు దక్కేలా ఇంటర్న్‌షిప్‌ను తప్పనిసరి చేశారు. పీజీ విద్యార్థులు సామాజిక స్పృహ కలిగి ఉండాలన్న ఉద్దేశంతో మానవ విలువలు, పర్యావరణం, భారత రాజ్యాంగం, సైబర్ సెక్యూరిటీ సబ్జెక్టులు బోధిస్తున్నారు.

ఏటా పురోగతి



పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా సెంట్రల్ వర్సిటీలో కొత్త కోర్సులు అందుబాటులోకి తెచ్చాం. 2024 -25 విద్యా సంవత్సరం నుంచి జంతలూరు శాశ్వత క్యాంపస్‌లో తరగతులు నిర్వహించనున్నాం. ఏటా విశేషంగా పురోగతి చెందుతూ సెంట్రల్ వర్సిటీ బలోపేతం కావడం గర్వంగా భావిస్తున్నాం.

– డాక్టర్ ఎస్ఏ కోరి, వీసీ, సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీ

2018లో ఏర్పాటు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం అనంతపురంలో సెంట్రల్ యూనివర్సిటీని 2018లో ప్రారంభించారు. తాత్కాలిక పాలక భవనాన్ని జేఎన్‌టీయూ (ఏ) ఇంక్యుబేషన్ కేంద్రంలో ఏర్పాటు చేసి, తరగతుల నిర్వహణ చేపట్టారు. పలు సౌలభ్యాల రీత్యా రెండు సంవత్సరాల క్రితం బళ్లారి రోడ్డులోని ఓ ప్రైవేట్ కళాశాలకు వర్సిటీని మార్చారు. తాజాగా జంతలూరు వద్ద శాశ్వత క్యాంపస్ నిర్మాణ పనులు పూర్తి కావడంతో అక్కడి నుంచి ఇకపై కార్యకలాపాలు నిర్వహించనున్నారు. జంతలూరు సెంట్రల్ యూనివర్సిటీ క్యాంపస్ 491.3 ఎకరాల్లో ఉండడం గమనార్హం. పాలక భవనం, తరగతి గదులను అత్యాధునిక హంగులతో నిర్మించారు. రాష్ట్ర ప్రభుత్వ నిధులతో వర్సిటీ చుట్టూ ప్రహరీ నిర్మించారు.

బడి బస్సులకు ఫిట్‌నెస్ చేయించుకోండి

హిందూపురం అర్బన్: త్వరలో పాఠశాలలు, కళాశాలలు పునః ప్రారంభం కానున్నాయి. జిల్లా వ్యాప్తంగా 362 బడి బస్సులు ఉన్నాయి. పాఠశాలలు, కళాశాలలు తెరవగానే బడి బస్సులు రోడ్డెక్కనున్నాయి. విద్యార్థులు రోజూ ప్రయాణించే స్కూల్, కళాశాల బస్సుల ఫిట్‌నెస్ పరీక్షలకు రవాణాశాఖ చర్యలు చేపట్టింది. ఇందుకు బడి బస్సుల ఫిట్‌నెస్ పరీక్షించే ప్రక్రియ హిందూపురంలో మొదలైనట్లు జిల్లా రవాణాశాఖ డిప్యూటీ కమిషనర్ కరుణసాగర్‌రెడ్డి తెలిపారు. స్కూల్స్ జూన్ 12 ప్రారంభం కానుండగా అంతలోపే ప్రతి బస్సునూ తనిఖీ చేయించుకొని తగిన రికార్డులు ఉంచుకోవాలన్నారు. పాఠశాలలు, కళాశాలలు ప్రారంభించిన తరువాత కూడా ఫిట్‌నెస్ లేని బస్సులు తనిఖీల్లో పట్టుబడితే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. బడి బస్సుల పాఠశాలలు, కళాశాలల నిర్వాహకులు బస్సులకు ఫిట్‌నెస్ చేయించుకోవాలని సూచించారు.

పారదర్శకంగా విత్తనశుద్ధి



విత్తన వేరుశనగ శుద్ధి కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి సుబ్బారావు

ధర్మవరం రూరల్: పారదర్శకంగా విత్తన శుద్ధి చేపట్టాలని జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ) వైటీ సుబ్బారావు విత్తన శుద్ధి యాజమాన్యం, ఏపీ సీడ్స్ సిబ్బందిని ఆదేశించారు. ధర్మవరంలోని శ్రీసాయిరామ్, విజేత అగ్రిటెక్ వేరుశనగ విత్తన శుద్ధి కేంద్రాలను తనిఖీ చేశారు. అనంతరం ఆయన వేరుశనగ నాణ్యతను, రిజిష్టర్లను పరిశీలించారు. జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ విత్తన వేరుశనగ నాణ్యతా ప్రమాణాలను తప్పకుండా పాటించాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ముస్తఫా, సహాయ సంచాలకులు కృష్ణయ్య, ఏఈఓలు జగదీష్, అశ్విని, ఉపేంద్ర, ప్రతిభ, ఏపీ సీడ్స్ సిబ్బంది సురేష్ పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీచెన్నకేశవుని బ్రహ్మోత్సవాలు





గరుడ, శేష వాహనాలపై విహరిస్తున్న లక్ష్మీచెన్నకేశవస్వామి

- నేడు బ్రహ్మ రథోత్సవం

ధర్మవరం అర్బన్: పట్టణంలో లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి.సోమవారం లక్ష్మీ చెన్నకేశవ స్వామి గరుడ, శేష, గజ వాహనాలపై పురవీధుల గుండా ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఇక బ్రహ్మోత్సవాల్లో కీలకమైన రథోత్సవం మంగళవారం నిర్వహించనున్నారు. ఉదయం 7గంటలకు మడుగు తేరును ఉభయదారుల సమక్షంలో ముఖ్య అతిథులు లాగుతారు. ఉదయం నుంచి సాయంత్రం 4 గంటల వరకు రథం వద్ద భక్తులు స్వామిని దర్శించుకునేలా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ దాశెట్టి సుబ్రహ్మణ్యం తెలిపారు. సాయంత్రం 4గంటలకు బ్రహ్మ రథోత్సవం ప్రారంభమవుతుందన్నారు. తేరు బజార్ నుంచి అంజుమన్ సర్కిల్ వరకు రథాన్ని లాగుతారు. రథం లాగే సమయంలో త్వరగా కదలడానికి రహదారి మొత్తం ఇసుక పరిచారు.

భారీ బందోబస్తు

రథోత్సవం సందర్భంగా భారీసంఖ్యలో భక్తులు హాజరుకానుండటంతో ధర్మవరం వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ముఖ్యంగా రథాన్ని లాగే సమయంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు చేపట్టారు. అందు కోసం ఇతర మండలాల నుంచి కూడా పోలీసులను బందోబస్తుకు నియమించినట్లు పేర్కొన్నారు.

కౌంటింగ్‌లో ఆర్‌ఓలదే కీలక పాత్ర

- జూన్ 6 వరకు కోడ్ అమలు
- సమీక్షలో కలెక్టర్ అరుణ్‌బాబు



అధికారులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: జూన్ 4వ తేదీన నిర్వహించే కౌంటింగ్‌లో ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు (ఆర్‌ఓ) కీలక పాత్ర పోషించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో అన్ని నియోజకవర్గాల ఆర్‌ఓలతో సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నిర్వహణ ముందస్తు ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆర్‌ఓలు నియోజకవర్గాల్లో లా అండ్ ఆర్డర్ మానిటరింగ్ చేయాలన్నారు. కౌంటింగ్ సమయంలో ఎన్నికల కమిషన్ సూచించిన అన్ని జాగ్రత్తలూ తీసుకోవాలన్నారు. కౌంటింగ్ సమయంలో ఆర్‌ఓలు ఏ నిర్ణయం తీసుకుంటారో అదే తుది నిర్ణయమన్నారు. ప్రతి రిటర్నింగ్ ఆఫీసర్ ఎన్నికల కమిషన్ ముద్రించిన మార్గదర్శకాల పుస్తకాలను చదివి అవగాహన పెంపొందించుకోవాలన్నారు. కౌంటింగ్ ప్రక్రియపై ఈ నెల 24న కలెక్టరేట్‌లో వర్క్‌షాప్ నిర్వహిస్తామన్నారు. పోలింగ్ సమయంలో జిల్లాలోని ప్రతి అధికారీ చక్కగా పని చేశారని, ఇదే స్ఫూర్తితో కౌంటింగ్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఫలితాలు ప్రకటించిన అనంతరం ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లు పటిష్ట బందోబస్తు మధ్య తిరిగి స్ట్రాంగ్ రూంలకు చేర్చాలన్నారు. అందుకు అవసరమైన సిబ్బందిని ముందుగానే సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహించరాదన్నారు. జూన్ 6వ తేదీ వరకూ ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందన్నారు. జూన్ 4న అబ్జర్వర్, పోటీలో ఉన్న వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో స్ట్రాంగ్ రూంలు తెరవాలన్నారు. అందుకు చురుకైన కౌంటింగ్ సిబ్బందిని నియమించుకోవాలన్నారు. కౌంటింగ్ సిబ్బందికి ఆయా నియోజకవర్గాల వారీగా శిక్షణ ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరికీ గుర్తింపు కార్డులు కచ్చితంగా ఉండాలన్నారు. డేటా ఎంట్రీకి సిబ్బందిని నియమించుకోవాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ ప్రక్రియ లేపాక్షి సమీపంలోని గురుకుల పాఠశాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్‌కుమార్, డీఆర్‌ఓ కొండయ్య, పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, పుట్టపర్తి, ధర్మవరం, మడకశిర, కదిరి ఆర్‌ఓలు భాగ్యరేఖ, వెంకట శివకుమార్‌రెడ్డి, గౌరీ శంకర్, సన్నీ వంశీకృష్ణ , తహసీల్దార్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్‌కు పటిష్ట భద్రత

ర్యాలీలు, ఊరేగింపులు, డీజేకు అనుమతుల్లేవ్



ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి టౌన్ : సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ప్రశాతంంగా నిర్వహించేందుకు పటిష్టమైన పోలీస్ భద్రత ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ మాధవరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. పోలింగ్ సమయంలో జరిగిన ఘటనల్లో పలువురిని రిమాండ్‌కు పంపినట్లు వెల్లడించారు. మరికొందరిని బైండోవర్ చేసినట్లు తెలిపారు. జూన్ నాలుగో తేదీ కౌంటింగ్ సందర్భంగా ఎవరైనా అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కౌంటింగ్ రోజున ర్యాలీలకు అనుమతులు లేవన్నారు. పోలింగ్ అనంతరం చోటు చేసుకొన్న హింసాత్మక సంఘటనలను దృష్టిలో ఉంచుకొని పెట్రోల్, డీజిల్ లూజుగా విక్రయాలపై నిషేధం విధించామన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామన్నారు. జిల్లా వ్యాప్తంగా సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి కార్డెన్ సెర్చ్ చేపడతున్నట్లు తెలిపారు. ఎన్నికల ఫలితాలకు సంబంధించి బెట్టింగ్ జోలికి వెళ్లి ఆర్థిక సమస్యలు కొని తెచ్చుకోవద్దని హెచ్చరించారు. బెట్టింగ్‌లు జరుపుతున్నట్లు తెలిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు. ప్రజలు అల్లర్లు, గొడవలకు వెళ్లకుండా ప్రశాంతంగా జీవించాలని సూచించారు.

నేరాల నియంత్రణే లక్ష్యం

- జిల్లా వ్యాప్తంగా కార్డన్ సెర్చ్ ముమ్మరం
- సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా
- వివాదాలకు దూరంగా ఉండకపోతే చట్టపరమైన చర్యలు



పుట్టపర్తి టౌన్: జిల్లాలో నేరాల నియంత్రణకు ఎస్పీ మాధవరెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలో జిల్లా వ్యాప్తంగా కార్డన్ సెర్చ్‌లు ముమ్మరం చేశారు. సమస్యాత్మక ప్రాంతాలపై నిఘా పెంచి గస్తీ ముమ్మరం చేశారు. పాత నేరస్తుల కదలికలపై ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారు.

అణువణువూ జల్లెడ పడుతున్న పోలీసులు

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పొరుగున ఉన్న అనంతపురం, తిరుపతి జిల్లాల్లో అల్లర్లు చోటు చేసుకోవడంతో జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. ఈ క్రమంలో జిల్లాలో నేరాల నియంత్రణపై ఎస్పీ మాధవరెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. నిందితులు, అసాంఘిక శక్తులు తలదాచుకునే ప్రాంతాలతో పాటు జిల్లా సరిహద్దు గ్రామాల్లో తనిఖీలు ముమ్మరం చేశారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో పోలీసులు తెల్లవారుజామునే ఆయా గ్రామాలను చుట్టుముట్టి ఎవరూ బయటకు వెళ్లకుండా, బయటి వ్యక్తులు లోపలికి రాకుండా చర్యలు తీసుకుని అణువణువూ జల్లెడ పడుతున్నారు. అనుమానిత వ్యక్తులు, వస్తువులు, ఇతర అంశాలపై ఆరా తీస్తున్నారు. రికార్డులు సక్రమంగా లేని వాహనాలను స్వాధీనం చేసుకుంటున్నారు. ఇంట్లో ఉన్న వ్యక్తుల పేర్లు సేకరించి, అనుమానాదస్పద వ్యక్తులు ఎవరైనా ఉంటే వెంటనే అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలిస్తున్నారు. అనంతరం పూర్తి స్థాయిలో విచారించి, నేరాలకు సంబంధం లేదని నిర్ధారించుకున్న తర్వాతనే వదిలేస్తున్నారు. వివిధ రాష్ట్రాలు, జిల్లాలకు చెందిన వారు జిల్లాలోకి ప్రవేశించకుండా చెక్‌పోస్టుల్లో తనిఖీలు ముమ్మరం చేశారు.

144 సెక్షన్ కొనసాగింపు

ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ముగిసేంత వరకూ జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో 144 సెక్షన్, 30 పోలీస్‌యాక్ట్ అమలు చేశారు. ఈ క్రమంలో ర్యాలీలు, సభలు, ఇతర వివాదస్పద కార్యక్రమాల నిర్వహణపై పోలీసు యంత్రాంగం దృష్టి సారించింది. సంఘ విద్రోహ చర్యలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే పెట్రోల్ బంక్‌లో పెట్రోల్, డీజల్‌ను బాటిళ్లు, క్యాన్లలో విక్రయించకుండా నిలుపుదల చేయించారు. అలాగే బాణాసంచా నిల్వలపై ఆరా తీసి అనుమతి పొందిన విక్రయదారులకు నోటీసులు జారీ చేశారు.

ప్రజలు సహకరించాలి



ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జూన్ 6 తేదీ వరకూ ఎన్నికల నియమావళి అమలులో ఉంటుంది. సిబ్బంది, ప్రజల సహకారంతో ఎన్నికలు ప్రశాంతంగా ముగించాం. కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకూ ఎలాంటి గొడవలకు పాల్పడకూడదు. ఇప్పటికే సమస్యాత్మక గ్రామాల్లో కార్డన్ సెర్చ్ ముమ్మరం చేశాం. కార్డన్ సెర్చ్ సమయంలో పోలీసులకు ప్రజలు పూర్తిగా సహకరించాలి. ఆందోళన చెందకుండా అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇస్తూ పూర్తి వివరాలు తెలియజేయాలి. అనుమాన్పాద వ్యక్తుల సంచారం, అసాంఘిక శక్తుల సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

– మాధవరెడ్డి, ఎస్పీ

క్లుప్తంగా

పేకాటరాయుళ్ల అరెస్ట్



కంబదూరులో జూదరుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

కంబదూరు/బత్తలపల్లి: ఉమ్మడి జిల్లాలోని వేర్వేరు మండలాల్లో సోమవారం పోలీసులు చేపట్టిన తనిఖీల్లో పలువురు పేకాటరాయుళ్లు పట్టుబడ్డారు. వివరాలు... అందిన ముందస్తు సమాచారంతో కంబదూరు మండలం మర్రిమాకులపల్లి శివారులో ఎస్ఐ ఆంజనేయులు, సిబ్బంది సోమవారం తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో 12 మంది పేకాటరాయుళ్లు పట్టుబడ్డారు. వీరి నుంచి రూ.55,150 నగదు, ఏడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అలాగే బత్తలపల్లి మండలం వెంకటగారిపల్లి సమీపంలో వ్యవసాయ తోటలో పేకాట ఆడుతూ నలుగురు పట్టుబడినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. వీరి నుంచి రూ.20,150 నగదు, మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి న్యాయస్థానంలో హాజరు పరచనున్నట్లు పోలీసులు తెలిపారు.

బ్రాహ్మణపల్లిలో విస్తృత సోదాలు



కార్డన్ సెర్చ్‌లో పాల్గొన్న సిబ్బందికి సూచనలిస్తున్న అధికారులు

పుట్టపర్తి రూరల్: స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లిలో సోమవారం ఉదయం పోలీసులు కార్డన్ సెర్చ్ చేపట్టారు. ఇటీవల ఎన్నికల సందర్భంగా ఆ గ్రామంలో ఘర్షణలు చోటు చేసుకున్నాయి. ఈ క్రమంలో స్థానికుల్లో కక్షలు మరోసారి ప్రేరిపితం కాకుండా ప్రత్యేక బలగాలతో పుట్టపర్తి సీఐ కొండారెడ్డి, రూరల్ సీఐ రాజారమేష్ ఆధ్వర్యంలో విస్తృత తనిఖీలు చేపట్టారు. గృహాలు, గడ్డివాములు, పరిసర ప్రాంతాల్లో అణువణువూ గాలించారు. జూన్ 4వ తేదీ వరకూ 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ఈ నేపథ్యంలో ఎలాంటి అల్లర్లకు పాల్పడిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో బుక్కపట్నం, నల్లమాడ, పుట్టపర్తి రూరల్ పోలీస్ స్టేషన్ల సిబ్బంది పాల్గొన్నారు.

రైలు ఢీకొని మార్నింగ్ వాకర్ మృతి

తాడిపత్రి: ప్రమాదవశాత్తు రైలు ఢీకొన్న ఘటనలో ఓ మార్నింగ్ వాకర్ మృతి చెందాడు. జీఆర్పీ ఎస్ఐ నాగప్ప తెలిపిన మేరకు... తాడిపత్రికి చెందిన రంగయ్య (30) రోజూ ఉదయం పూట వాకింగ్ కోసం తాడిపత్రి రైల్వేస్టేషన్‌కు వెళ్లేవాడు. ఈ క్రమంలోనే సోమవారం ఉదయం రైల్వే స్టేషన్‌కు చేరుకున్న ఆయన రెండు, ఒకటో నంబర్ ప్లాట్‌ఫాంల మధ్య పట్టాలు దాటుతుండగా గూడ్స్ రైలు ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రంగయ్యను రైల్వే పోలీసులు చికిత్స నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించక ఆయన మృతి చెందాడు. ఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, మృతుడికి భార్య నాగమణి, కుమారుడు దేవాన్స్ ఉన్నారు.

వివాహిత బలవన్మరణం

కళ్యాణదుర్గం రూరల్: కుటుంబ కలహాలతో విసుగు చెందిన ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... కళ్యాణదుర్గం మండలం మల్లిపల్లి గ్రామానికి చెందిన ఈరన్న, చిత్రక్క (35) దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. కూలి పనులతో జీవనం సాగించే వారు. ఈ క్రమంలో ఈరన్న మద్యానికి బానిసయ్యాడు. తాగుడు మానేసి కుటుంబపోషణపై దృష్టి సారించాలని పలుమార్లు చిత్రక్క వేడుకుంది. అయినా ఈరన్న తాగుడు మానలేదు. ఇదే అంశంపై సోమవారం ఉదయం దంపతుల మధ్య గొడవ చోటు చేసుకుంది. అనంతరం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఇంటిపై కప్పుకు చిత్రక్క ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. చుట్టుపక్కల వారు గమనించి సమచారం ఇవ్వడంతో కుటుంబసభ్యులు, పోలీసులు అక్కడకు చేరుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ఆరుమాకులపల్లిలో కర్ణాటక పోలీసుల తనిఖీలు

- 30 ద్విచక్ర వాహనాల స్వాధీనం

హిందూపురం అర్బన్: చిలమత్తూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆరుమాకులపల్లిలో సోమవారం సాయంత్రం కర్ణాటక పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. కర్ణాటక ప్రాంతంలో చోరీలకు పాల్పడుతున్న ముఠా ఇచ్చిన సమాచారం మేరకు చిక్కబళ్లాపురం డీఎస్పీ, సిబ్బంది ఆరుమాకులపల్లి చేరుకున్నారు. నాగభూషణం అనే వ్యక్తి ఇంట్లో దాచిన 30 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వాహనాలను ప్రత్యేకంగా క్యాంటర్‌లో చిక్కబళ్లాపురానికి తరలించారు. కర్ణాటక ప్రాంతంలో చోరీ చేసిన వాహనాలను తీసుకొచ్చి నాగభూషణం వద్ద డంప్ చేసి తక్కువ ధరకు విక్రయించి సొమ్ము చేసుకునేవారుగా గుర్తించారు. అలాగే చిలమత్తూరు మండలంలోని మరో రెండు గ్రామాల్లో 40 వాహనాలు రికవరీ కావాల్సి ఉందని కర్ణాటక పోలీసులు తెలిపారు.

పొదుపు సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయాలి



వైకేపీ సిబ్బందితో సమావేశమైన డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, తదితరులు

బత్తలపల్లి: గ్రామీణ ప్రాంతాల్లోని పొదుపు సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయాలని వైకేపీ సిబ్బందికి డీఆర్‌డీఏ పీడీ కేఎస్ నరసయ్య సూచించారు. పొదుపు సంఘాల నిర్వహణ అంశంపై స్థానిక భారతి మండల సమాఖ్య కార్యాలయంలో బత్తలపల్లి, ముదిగుబ్బ, గాండ్లపెంట, ఓడీ చెరువు, చెన్నేకొత్తపల్లి మండలాల సిబ్బందితో సోమవారం ఆయన సమీక్షించారు. సంఘాల సభ్యులతో సమావేశమై వార్షిక ఆదాయం ఎలా పెంచుకోవాలో అవగాహన కల్పించాలన్నారు. రుణాల చెల్లింపుల్లో ముదిగుబ్బ మండలం చాలా వెనుకబడి ఉందన్నారు. వెంటనే పురోగతి చూపించాలని ఆదేశించారు. అంతకు ముందు స్వయం సహాయక సంఘాలు, గ్రామ సంఘాలు, మండల సమాఖ్యల పనితీరుపై సమీక్షించారు. సమావేశంలో వైకేపీ ఏరియా కోఆర్డినేటర్ రామేశ్వర రెడ్డి, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ (జీవనోపాదులు) రామ్మోహన్, ఫైనాన్స్ రామిరెడ్డి, హెచ్‌ఆర్ రమణప్ప, ఏపీఎం సుదర్శన్‌రాజు, ఐదు మండలాల ఏపీఎంలు, సీసీలు, అకౌంటెంట్లు పాల్గొన్నారు.

ప్యాసింజర్ రైళ్ల సమయ పాలనపై దృష్టి సారించండి

- వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్‌సీఆర్‌జీఎం అరుణ్‌కుమార్‌జైన్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జీఎం అరుణ్‌కుమార్ జైన్

గుంతకల్లు: ప్యాసింజర్ రైళ్ల సమయపాలనపై దృష్టి సారించాలని రన్నింగ్ సిబ్బందికి దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనజర్ అరుణ్‌కుమార్ జైన్ సూచించారు. సోమవారం జోనల్‌లోని గుంతకల్లు, గుంటూరు, విజయవాడ, హైదరాబాద్, సికింద్రాబాద్ డివిజన్ల డీఆర్‌ఎంలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ప్యాసింజర్, మెయిల్ ఎక్స్‌ప్రెస్ రైళ్ల భద్రత, సమయపాలనపై దిశానిర్దేశం చేశారు. రైళ్లను సురక్షితంగా నడపడం, భద్రతాకు సంబంధించిన విధివిధానాలను ప్రతి ఒక్కరూ కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. లోకో పైలట్లు, అసిస్టెంట్ లోకో పైలట్లు, స్టేషన్ మాస్టర్లు, పర్మినెంట్ వే మెయింటెనెన్స్ సిబ్బందితోపాటు రన్నింగ్ సిబ్బందికి క్రమం తప్పకుండా భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అంతేకాక అధికారులు కూడ క్షేత్ర స్థాయిలో ఎప్పటికప్పుడు తనిఖీలు చేపట్టాలన్నారు. ట్రాక్, సిగ్నల్ మెయింటెనెన్స్ తదితర నిర్వహణ పనులు చేపట్టే ముందు ముందుస్తు కార్యాచరణను రూపొందిచాలన్నారు. ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా అన్ని రైళ్లలో ఏసీ కోచ్‌లు సక్రమంగా పని చేసేలా చూడాలని, సాంకేతిక లోపాలను యుద్ధ ప్రాతిపదికన సరిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో గుంతకల్లు నుంచి డీఆర్‌ఎం వినీత్‌సింగ్ పాల్గొన్నారు.

బాలికపై అత్యాచారం

పెనుకొండ రూరల్: బాలికపై అత్యాచారం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. 'కియా' ఎస్ఐ రంగడు తెలిపిన మేరకు... పెనుకొండ మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికపై అదే గ్రామానికి చెందిన కురుబ యల్లప్ప మూడు రోజుల క్రితం ఇంట్లో ఎవరు లేని సమయంలో అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఇంటర్ సప్లి పరీక్షలకు సిద్ధం

- 24 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు
- ఏర్పాట్లు చేస్తున్న ఇంటర్ బోర్డు అధికారులు



పరీక్షల ఏర్పాట్లపై డీఈసీ సభ్యులతో సమీక్షిస్తున్న అనంతపురం ఆర్ఐఓ వెంకటరమణనాయక్

అనంతపురం ఎడ్యుకేషన్: ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నెల 24 నుంచి జరగనున్న సప్లిమెంటరీ పరీక్షలకు అనంతపురం జిల్లా వ్యాప్తంగా 34 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ నెల 30తో ప్రధాన పరీక్షలు ముగియనుండగా, తర్వాత 31, జూన్ 1 మైనర్ సబ్జెక్టుల పరీక్షలు ఉంటాయి. ఈ నెల 22న వారితో సమావేశం ఏర్పాటు చేయనున్నారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలుంటాయి. పరీక్ష సమయంలో నిమిషం ఆలస్యమైనా కేంద్రంలోకి అనుమతి ఉండదు. విద్యార్థులు అరగంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

అందుబాటులో హాల్‌టికెట్లు

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి హాల్‌టికెట్లు అందుబాటులో ఉంచారు. ఇప్పటికే ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్ల లాగిన్లకు పంపారు. విద్యార్థులు నేరుగా ప్రిన్సిపాళ్లను సంప్రదించి హాల్‌టికెట్లను అందుకోవచ్చు. అలాగే మంగళవారం నుంచి https://apbiercres.osdes.in వెబ్‌సైట్‌లోనూ అందుబాటులో ఉంచనున్నట్లు ఆర్ఐఓ వెంకటరమణనాయక్ తెలిపారు. విద్యార్థులు నేరుగా ఈ వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. హాల్‌టికెట్లపై ప్రిన్సిపాల్ సంతకం చేయాల్సిన అవసరం లేదన్నారు.

పరీక్షల షెడ్యూలు ఇలా...

తేదీ	మొదటి సంవత్సరం	ద్వితీయ సంవత్సరం
24	సెకండ్ లాంగ్వేజ్	సెకండ్ లాంగ్వేజ్
25	ఇంగ్లిష్	ఇంగ్లిష్
27	గణితం1ఏ/బొటనీ/సివిక్స్	గణితం2ఏ/బొటనీ/సివిక్స్
28	గణితం1బీ/జువాలజీ/హిస్టరీ	గణితం2బీ/జువాలజీ/హిస్టరీ
29	ఫిజిక్స్/ఎకనామిక్స్	ఫిజిక్స్/ఎకనామిక్స్
30	కెమిస్ట్రీ/కామర్స్/సోషియాలజీ/ఫైన్‌ఆర్ట్స్/మ్యూజిక్	కెమిస్ట్రీ/కామర్స్/సోషియాలజీ/ఫైన్‌ఆర్ట్స్/మ్యూజిక్

బొప్పాయి సాగు .. భలే బాగు!

- యాజమాన్య పద్ధతులు పాటిస్తే బొప్పాయి పంట సాగులో సిరులు
- జిల్లా వ్యాప్తంగా 5500 ఎకరాల్లో సాగు



వడియంపేట వద్ద సాగు చేసిన బొప్పాయి పంట

బుక్కరాయసముద్రం: ఏటా సంప్రదాయ పంటల సాగు చేసి దిగుబడి రాక ఇబ్బందులు ఎదుర్కొన్న జిల్లా రైతులు ప్రస్తుతం ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారిస్తున్నారు. ఈ క్రమంలో పండ్ల తోటలు గణనీయంగా విస్తరించాయి. అయితే బొప్పాయి సాగు రైతులకు లాభాలు వర్షం కురిపిస్తోంది. జిల్లా వ్యాప్తంగా 5,500 ఎకరాల్లో బొప్పాయి సాగులో ఉందని, రైతులు సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడి ఉంటుందని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం కో–ఆర్డినేటర్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి తెలిపారు. ప్రస్తుతం మార్కెట్‌లో బొప్పాయికి మంచి డిమాండ్ ఉందన్నారు. బొప్పాయి సాగులో రైతులు పాటించాల్సిన యాజమాన్య పద్ధతులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆమె వివరించారు.

సమగ్ర యాజమాన్య పద్ధతులు

రైతులు మొదట ఆరోగ్యవంతమైన మొక్కలను ఎంపిక చేసుకోవాలి. కోవన్, 786 రెడ్‌లేడీ, కూర్గ హనేడ్యూ, సోలో, పుసా మెజిస్టీ, సన్‌రూజ్ సోలో, సూర్య, ఆర్క ప్రభాత్, వాషింగ్‌టన్ వంటి రకాలు ఎంపిక చేసుకుని ఎకరాకు వెయ్యి చొప్పున మొక్కలు నాటుకోవాలి. మొక్కకు మొక్కు మధ్య 6 అడుగుల దూరం 7 అడుగుల వెడల్పు ఉండేలా చూసుకోవాలి. విత్తనాలైతే 1 సెంటీమీటరు లోతు మించకుండా విత్తుకోవాలి. భూమిని 30–40 సెంటీమీటర్ల లోతుగా దుక్కి చేసుకోవాలి. మొక్కల గుంతలలోకి పశువుల ఎరువు, వేప పిండి, వేసుకోవాలి.

వైరస్ తెగుళ్ల యాజమాన్యం

బొప్పాయి సాగులో వైరస్ తెగుళ్లు ఎక్కువగా ఉంటాయి. ఆకు ముడత, రింగ్ స్పాట్ వైరస్ ప్రధానమైనవి. బొప్పాయి నారును రసం పీల్చే పురుగులు ఆశించకుండా 40 గీ60 విస్తీర్ణంలోని నైలాన్ మెష్ నెట్ హౌస్‌లో పెంచాలి. బొప్పాయి తోట సాగు చేసే సమయంలో తోట చుట్టూ రెండు వరసలు మొక్కజొన్న, అవిశ చెట్లు రక్షణగా వేసుకోవాలి. వీటి ద్వారా రసం పీల్చే పురుగులను నివారించవచ్చు. రసం పీల్చే పురుగుల నివారణకు వేపనూనె 2.5 మిల్లీ, అసిఫేట్ 2.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. రింగ్ స్పాట్ వైరస్ నివారణకు లీటరు నీటికి 10 గ్రాముల యూరియా, జింక్ సల్ఫేటు 1.5 గ్రాములు, బోరాక్ 1 గ్రాము కలిపి పిచికారీ చేయాలి. కాండం కుళ్లు తెగులు ఉన్నట్లుగా గుర్తిస్తే లీటరు నీటికి బోర్డో మిశ్రమం 1 గ్రాము, అలియేట్ 2 గ్రాములు కలిపి వారం రోజుల వ్యవధిలో 2, 3 సార్లు మొదలు దగ్గర బాగా తడపాలి. బూడిద తెగులు నివారణకు లీటరు నీటిలో కరిగే గంధకం 3 గ్రాములు, 1 మిల్లీ కెరాథేన్ కలిపి చెట్లపై పిచికారీ చేయాలి.

పంట కోత, దిగుబడి

బొప్పాయి సాగులో ఎకరాకు 1000 మొక్కలు నాటుకోవాలి. ఎకరాకు 25 నుంచి 30 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. పంట సాగు చేసిన 7 నెలల కాలం నుంచి ప్రతి 15 రోజులకు ఒకసారి కటింగ్ చొప్పున 5 నుంచి 8 నెలల వరకూ పంట కోత ఉంటుంది. ఆ తర్వాత కూడా ఏడాదిన్నర పాటు పంట వస్తుంది. అయితే కాయ నాణ్యత ప్రమాణం తగ్గుతుంది. ఒక ఎకరా పొలంలో బొప్పాయి సాగుకు రూ.50వేల నుంచి రూ.70 వేల వరకు పెట్టుబడి అవుతుంది. ప్రస్తుతం మార్కెట్‌లో బొప్పాయి కిలో రూ.25 నుంచి రూ.28 వరకు అమ్ముడుపోతోంది. టన్నుకు రూ.25వేల నుంచి రూ.28 వేల ఆదాయం గడించవచ్చు.

జాగ్రత్తలు తప్పని సరి



జిల్లాలో రైతులు సాగు చేస్తున్న బొప్పాయి తోటల్లో రైతులు బ్యాక్టీరియా, వైరస్ తెగుళ్లపై జాగ్రత్తలు తప్పని సరిగా తీసుకోవాలి. శాస్త్రవేత్తల సూచన మేరకు ఎరువులు తప్పని సరిగా వేయాలి. నాణ్యమైన బొప్పాయి పంటకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది.

– డాక్టర్ మల్లేశ్వరి, కేవీకే ప్రధాన శాస్త్రవేత్త

సాక్షి ఉద్యోగ అవకాశాలు
ప్రతి మంగళ, శుక్రవారములలో

WANTED MANAGERS
అనంతపురం నందు
ప్రముఖ లైఫ్ Insurance Co. కొరకు MANAGERS కావలెను. M/F, Age: Upto 40 Yrs, Qul: Any Degree, Exp: 2 Yrs, Sal: 4L to 9L P/A+Incentives.
7306812727

WANTED
S.V.Degree & P.G College
Jesus Nagar, Ananthapuramu.Ph : 08554-234477, 9618469729
I) LECTURERS : Candidates must attend for interviews with all testimonials
Subjects: 1. Computer Science 2.Electronics 3. Bio-Technology
Eligibility: PG Degree with minimum 55%.
Preference will be given for Ph.D, SET/ NET Qualified & Experienced candidates.
II) NON- TEACHING STAFF: 1. Lady Warden (Full time), 2. Lab programmers for Computer Science 3. Attenders
Send your resumes to : careers@svdegreecollege.ac.in
Last date for submission of resumes: 25-05-2024 - Correspondent

PENNA GROUP OF SCHOOLS
Talaricheruvu, Boyareddypalli, Mantapampalli
WALK-IN-INTERVIEW
Date : 26-05-2024, Sunday Time : 9-30 am to 4-00 pm

Category	Subject	Qualification	Salary
Pre-Primary	All Subjects	T.T.C / D.Ed. (or) Any Pre-Primary Certificate course	12,000 - 15,000
Primary	All Subjects	T.T.C (or) B.Sc / M.Sc with B.Ed / M.Ed (Should be able to deal Olympiad)	15,000 - 20,000
High School	Telugu, Hindi, English, Maths, Physics, Chemistry & Biology	B.Sc / M.Sc with B.Ed / M.Ed (IIT Faculty preferred)	20,000 - 30,000
Primary & High School	P.E.T	Any Degree with B.P.Ed / M.P.Ed	15,000 - 20,000

Recruitment Process :
WRITTEN TEST, DEMO & PERSONAL INTERVIEW
Venue : MANGALYA FUNCTION HALL
at New Vegetable Market, Opp. to Lalitha Megha Mall, TADIPATRI.
Contact : 7989003739, 8333886065
Fresher can Walk-in
Carry latest Resume, one set of Xerox Certificates and 2 Colour Passport Photographs

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
PHARMA / NURSING
■ B.ఫార్మసీ, B.Sc. (నర్సింగ్) కి అడ్మిషన్స్ జరుగుచున్నవి. ఫ్రీ ఎడ్యుకేషన్, కాలేజిలో హాస్టల్ కలదు. సంప్రదించండి : జి.మురళీ, 9030661651, అనంతపురము. [A-1999]

EDUCATION
■ రెగ్యులర్/డిస్టెన్స్/మధ్యలో చదువు ఆపేసిన/ఫెయిల్ అయిన వారికి/ ఒకే సంవత్సరంలో పాస్ అయ్యే అవకాశం. 10th, 12th, Diploma, B.Tech, M.Tech, Degree, BCA, BBA, MBA, MCA, LLB, BEd, DEd, MLT, ANM, DMLT, ANESTHESIA, OT, MPHW. 86861 72989. [L-800616]

REAL ESTATE
RENT / SALE
■ భాజానగర్, గౌరీ టాకీస్ దగ్గర, నారాయణ కాలేజ్ ప్రక్కన, # 13-3-614లో గల 3 ఫ్లోర్స్ బిల్డింగ్ ఆఫీస్ / గోడౌన్ / కాలేజీలకు బాడుగకు లేదా అమ్మకానికి కలదు. 9912028216. [A-103]

TOLET
■ డబుల్ బెడ్‌రూం ఇల్లు, మంచినీరు పుష్కలం, బాడుగ రూ.8000/- కళ్యాణదుర్గం రోడ్, Dr.రజాక్ హాస్పిటల్ ప్రక్కన, పెట్రోల్‌పంపుకు పోవురోడ్డుకి సెల్:9951626131. [A-109]

ఇల్లు అమ్మబడును
■ కదిరి పట్టణంలో 3.5 సెంట్ల విస్తీర్ణంలో NGO కాలనీ నందు సుమారు రూ.20,000 నుండి 25,000 అద్దెవచ్చు కొత్త ఇల్లు అమ్మబడును. (బ్యాంక్ లోన్ సౌకర్యం కలదు). సంప్ర. సెల్:9959896556, 9490481674. [A-120]

WANTED
■ అనంతపురం టౌన్, ఉత్సవ్ బొటిక్ కొరకు అనుభవం కల్గిన మార్కెటింగ్ మేనేజర్ కావలెను. ఆకర్షణీయమైన జీతం+ఇన్సెంటివ్స్ కలవు. సెల్: 9000564894. [A-784644]
■ లేడీస్ టైలర్స్ కావలెను. ATP లోని ప్రముఖ గార్మెంట్స్ నందు పనిచేయుటకు మహిళ టైలర్స్ కావలెను. ఫోన్ టైమింగ్స్ 10 AM to 9 PM, Contact : 9989956694. [A-3140]
■ S.R. డిఫెన్స్ అకాడమీ నందు పనిచేయుటకు టెలికాలర్స్ & సిస్టమ్ ఆపరేటర్లు, PET (ఫిజికల్ ఎడ్యుకేషన్ ట్రైనర్) కావలెను. సంప్ర : 9780029999. [A-122]
■ ప్రముఖ కంపెనీలో అగర్‌బత్తీస్, హారతి కర్పూరం, కపసాంబ్రాణి, ధూప్‌స్టిక్స్, తయారి వద్ద జిల్లా సూపర్ స్టాకిస్ట్ డిస్ట్రిబ్యూటర్స్ డీలర్స్ కావలెను. 9515983309, 9908776516. [G-1495]
■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైమ్ మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500rs. మీ పేరు, కాల్ / వాట్సప్ చేయగలరు. 9502615217. [G-8890]
■ శ్రీలక్ష్మీహోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులకు, పేషెంట్లకు సేవ చేయుటకు బేబికేర్ ఇంటి/వంటపనికి స్త్రీ/పు కావలెను. జీతం: 17000/- రూం+మీల్స్ ఫ్రీ. 9347148051. [G-1494]
■ మాతంపెని కొరకు 80మంది స్త్రీ,60మంది పురుషులు & టెలికాలర్స్ (F) అర్జెంటుగా కావలెను. ఫ్రీ రూం+భోజనం +జీతం: 24,000/- వరకు. డైరెక్ట్ జాబ్, స్పాట్ జాయినింగ్. ఫోన్: 8886733008 [HA-10856]
■ యర్రగుంట్ల ప్రముఖ సిమెంట్ ఫ్యాక్టరీలో పని చేయడానికి అనుభవం కలిగిన సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. 10th పాస్, డిస్టెన్స్ 40 కి.మీ. పైన. వ: 40 సం॥ లోపు. PF + ESI వీక్లీ ఆఫ్ కలదు. ✆ 83746 14105, 92463 25282. [B-755718]
■ పామిడి పట్టణం, శ్రీ చైతన్య ఇం.మీ. హై స్కూల్ నందు 1st to 10th అన్ని సబ్జెక్టులు బోధించుటకు ఉపాధ్యాయులు కావలెను. ఆకర్షణమైన వేతనం ఇవ్వబడును. (హాస్టల్ వసతి కలదు). 9573736655, 8790612613. [A-105]
■ SBI లైఫ్ ఇన్సూరెన్స్ నందు అడ్వయిజర్స్ నియామకాలు జరుగుచున్నవి. నెలకు ఆదాయం రూ. 25,000 + ఈ పైన, కనీసం 10th క్లాస్ పాస్ అయి, 25 సం॥ నిండి ఉండవలెను. ఫోన్ : 9849571330. [A-102]
■ డిగ్రీ పూర్తి చేసిన యువతీ/యువకులకు ఇంటి వద్ద నుండే ప్రముఖ MNCతో పనిచేసుకునే అవకాశం. Part Time 20K+, Full Time 50K+ సంపాదించు కనే అవకాశం. జీవితంలో ఆర్థికంగా ఎదగాలనే కసి, తపన ఉన్నవారు మాత్రమే మీ పేరు, ఊరు,నెంబర్ వాట్సప్ చేయండి. 91337 38262 [B-755717]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.